andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్

జిల్లా వార్తలు



5

శనివారం 20 ఏప్రిల్ 2024



• నవీపేటలో కూలిన భారీ వృక్షం

ఈదురు గాలుల బీభత్సం



• నవీపేటలో ధాన్యం సంచుల కిందికి చేరిన నీటిని తొలగిస్తున్న రైతులు



• గన్నారంలో నేలకొరిగిన రావిచెట్టు

- జిల్లాలో ఈదురు గాలుల వర్షం
- కల్లాల్లో తడిసిన ధాన్యం కుప్పలు
- విరిగిపడ్డ భారీ వృక్షాలు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- పిడుగుపాటుకు గేదెల మృతి

నిజామాబాద్ న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 19: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో చెట్లు నేలకూలాయి విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలుల దాటికి పలు ఇళ్ల పైకప్పులు, రేకులు ఎగిరిపోయాయి. వరితోపాటు ఇతర పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. నందిపేట మండలంలోని లక్కంపల్లి, చిరాంజీపల్లి, వెల్మల్, నందిపేట, కుద్వాన్‌పూర్ గ్రామాల్లో రాళ్ల వర్షం కురిసింది. మామిడితోటకు పూర్తి స్థాయిలో నష్టం వాటిల్లింది. కౌల్‌పూర్ శివారులోని యోగా శక్తి పీఠం ఆశ్రమంలో చెట్లు విరిగిపడ్డాయి. కుద్వాన్‌పూర్‌లో పిడుగుపాటుకు మూడు గేదెలు మృతి మృతి చెందాయి. సాయిలు, బోనయి చిన్నారెడ్డి, దాసరి నారాయణలకు చెందిన గేదెలు మృతి చెందాయి. గేదెల విలువ ఒక్కొక్కటి రూ.60నుంచి రూ.70వేల వరకు ఉంటుందని నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు. అలాగే ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మార్కెట్ యార్డు, పిప్రి రోడ్డులో, దోబీఘాట్‌లలో కల్లాల పైన ఉన్న ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయ్యింది. నవీపేట మండలంలో కల్లాలు, రోడ్లపై ఉన్న ధాన్యం రాసులు భారీ వర్షానికి తడిసి ముద్దయ్యాయి. నవీపేట, గాంధీనగర్‌లలోని పలు చోట్ల చెట్లు నేలకూలాయి. గాంధీనగర్, జన్నేపల్లిల మధ్యన ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అబ్బాపూర్ (ఎం) శివారులో నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. డిచ్‌పల్లి మండలంలోని కమలపూర్ శివారులోని పౌల్ట్రీఫాం వద్ద విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. మిట్టపల్లిలో పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలపై పడిపోయింది. మోపాల్ మండలంలోని కల్లాల వద్ద రోడ్ల మీద పోసిన ధాన్యం అంతా తడిసిపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. సిర్పూర్, ముదక్‌పల్లి, న్యాల్‌కల్ గ్రామాల ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ఇందల్వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి, గన్నారం, ఇందల్వాయి, సిర్నాపల్లి, నల్లవెల్లి, త్రియంబకోపేట్ గ్రామాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయి విద్యుత్ తీగలు నేలపై వేలాడాయి. గన్నారం గ్రామంలోని హనుమాన్ ఆలయం ఎదురుగా ఉన్న వంద ఏళ్ల చరిత్ర గల రావి చెట్టు గాలివానకు నేలకొరగడంతో విద్యుత్ స్తంభాలు విరిగి తీగలు రోడ్డుపై పడిపోయాయి. కల్లాల్లోని ధాన్యం రాసులు తడిసి ముద్దయ్యాయి. మామిడికాయలు పూర్తిగా నేలరాలాయి. ధర్పల్లి మండలంలో విద్యుత్ స్తంభంతో పాటు, చెట్లు, రేకుల పైకప్పులు, గుడిసెలు చెల్లాచెదురయ్యాయి. రెంజల్ మండలంలో ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.




ఇందల్వాయిలో గాలివాన బీభత్సానికి ఇంటి పైకప్పు ఎగిరిపోవడంతో వర్షంలో తడుస్తున్న ఓ కుటుంబం



• మోపాల్‌లో..



• ఆర్మూర్ మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యం



• కుద్వాన్‌పూర్‌లో పిడుగుపాటుకు మృతి చెందిన గేదెలు

రెండో రోజు ఏడు నామినేషన్లు

- నామినేషన్లు దాఖలు చేసిన అర్వింద్, బాజిరెడ్డి
- ఇద్దరు పార్టీ, మరో ఇద్దరు స్వతంత్రుల నామినేషన్
- కలెక్టరేట్ వద్ద స్వల్ప ఘర్షణ



బీఆర్ఎస్ తరఫున నామినేషన్ వేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్



బీజేపీ తరఫున నామినేషన్ వేస్తున్న ధర్మపురి అర్వింద్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆరుగురు అభ్యర్థులు మొత్తం ఏడు నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు అభ్యర్థులు త మ నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ తరఫు న అర్వింద్ నామినేషన్ వేశారు. బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా దేవతి శ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థిగా రాపెల్లి శ్రీనివాస్, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా కండెల సుమన్, స్వతంత్ర అభ్యర్థిగా రాగి అనిల్‌లు కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు.

రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేసిన బాజిరెడ్డి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నామినేషన్ దాఖలు చేశారు. రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి, మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తలు వెంట రాగా ఒకసెట్, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, జగిత్యాల జడ్పీ చైర్మన్ వసంత, బోధన్ బీఆర్ఎస్ నాయకురాలు అయేషా సుల్తానాలతో కలిసి రెండోసెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. నామినేషన్‌కు ముందు బాజిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి నగరంలోని మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పసుపు రైతులతో కలిసి ధర్మపురి అర్వింద్ నామినేషన్

బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద్ పసుపు రైతులతో కలి సి నామినేషన్ దాఖలు చేశారు. పార్లమెంట్ పరిధిలోని బాల్కొం డ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలకు చెందిన పసుపు రైతులతో కలిసి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఎంపీ అర్వింద్ నామినేషన్ రుసుము రూ.25వేలను పసుపు రైతులు చెందాలు వేసుకొని సమకూర్చారు. బాల్కొండకు చెందిన రైతులు వెల్మ రమేష్ తన ఇంటి వద్దే సుమారు 40 క్విం టాళ్ల పసుపును క్వింటాలుకు రూ.19,500 చొప్పున అమ్ముకోగా ఆయన అర్వింద్‌కు నామినేషన్‌ను ప్రపోజ్ చేశారు. నామినేషన్ అనంతరం అర్వింద్ మాట్లాడుతూ గడిచిన ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ రైతులు తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించడం జరిగిందన్నారు. పసుపు రైతులే తన నామినేషన్‌కు డబ్బులు ఇవ్వడం తన అదృష్టంగా భావిస్తున్నానని వాళ్లకు ధన్యవాదాలు తెలిపారు. నామినేషన్‌కు ముందు అపురూప వెంకటేశ్వర ఆలయం, నీలకంఠేశ్వర ఆలయంలో ధర్మపురి అర్వింద్ పూజలు చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలి
: ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలని మాజీ ఎమ్మెల్యే, జీవన్‌రెడ్డి అన్నారు. మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అమలు కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. పసుపు బోర్డు తెస్తానని చెప్పి ఎంపీ అర్వింద్ ప్రజలను మోసం చేశాడని ఆయన విమర్శించారు.

నామినేషన్ కేంద్రం వద్ద పోలీసుల హడావిడి

నామినేషన్ దాఖలు సందర్భంగా కలెక్టరేట్ వద్ద పోలీసుల హడావిడి కినిపించింది. అభ్యర్థుల వెంట ఐదుగురికి మించి లోనికి పంపలేదు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులను, పార్టీ కార్యకర్తలను పోలీసులు తోసివేయడంతో చిన్నపాటి ఘర్షణ జరిగింది. మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి బాజిరెడ్డి తరఫున రెండో సెట్ నామినేషన్ వేయడానికి కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్, ట్రైనీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, తదితరులు [illegible] బందోబస్తును పర్యవేక్షించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో నేతల గుండాగిరి



• బీఆర్ఎస్ బహిరంగ సభలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్

మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్, చిత్రంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, గంగుల, శ్రీనివాస్‌గౌడ్

నిజామాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/సుభాష్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వంలో నేతలు గుండాగిరి చేస్తున్నారని ఇచ్చిన ఏ హామీలను నెరవేర్చడం లేదని మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్ ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ నామినేషన్ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభలో వారు పాల్గొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ హామీలు ఇప్పటి వరకు అమలు కాలేదని విమర్శించారు. బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుటుంబాన్ని కావాలనే వేధిస్తున్నారని వారు ఆరోపించారు.

ఎన్నికల్లో మ్యాచ్‌ఫిక్సింగ్ : ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికలో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు అర్వింద్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఇద్దరు ఒక్కటయ్యారని ఆరోపించారు. కరీంనగర్‌లో పోటీ పడుతున్న జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ తరఫున అభ్యర్థిగా ఇక్కడికి తీసుకువచ్చారని ఆయన విమర్శించారు. బీజేపీ అభ్యర్థి ఇచ్చిన ఏ హామీ ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. పసుపు సాగు తగ్గడం వల్లనే డిమాండ్ పెరిగిందని ఇందులో అర్వింద్ కృషి ఏమీ లేదని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డిలు అర్వింద్ గెలుపునకు పనిచేశారని ఆయన ఆరోపించారు. అలాగే పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులను చూసి ఓట్లు వేయాలని రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్‌కు 2014లో ఎంపీ కవితను ఎలా గెలిపించుకున్నామో అదే స్ఫూర్తితో ఈ దఫా బాజిరెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ ఎల్. రమణ అన్నారు. ఈ ఎన్నికలో బీఆర్ఎస్‌కు అనుకూల పవనాలు ఉన్నాయని అన్ని సర్వేలు చెబుతున్నాయని మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్త అన్నారు. బీఆర్ఎస్‌కు త్వరలోనే పూర్వవైభవం వస్తుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో పలు అభివృద్ధి పనులను చేపట్టామని జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌ను ఓడించేది మేమే..
: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్‌ను ఓడించేది మేమేనని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పది నుంచి పన్నెండు స్థానాలు గెలుస్తుందన్నారు. ఎంపీ అర్వింద్ ఈ ఐదేళ్లలో ఎప్పుడు ప్రజల్లో కనిపించలేదన్నారు. ఐదేళ్లు ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి ఎప్పుడైనా నిజామాబాద్ వచ్చారా అని ప్రశ్నించారు. పనిచేసే వారికే ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్మన్లు దాదన్నగారి విఠల్‌రావు, దావ వసంత, అయేషా సుల్తానా, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మేయర్ నీతూకిరణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.





జోరుగా ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 480 కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటి వరకు లక్షా 79,222 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతుల ఖాతాలో రూ.148 కోట్ల జమ

నిజామాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం కొనుగోలు ఊపందుకున్నాయి. ప్రతిరోజూ 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 480 కొనుగోలు కేంద్రాలను ఇప్పటి వరకు ఏర్పాటు చేశారు. వీటిలో 397 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని ప్రస్తుతం మద్దతు ధరకే కొంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఏగ్రేడ్ ధాన్యాన్ని క్వింటాలుకు 2203 రూపాయలకు కొనుగోలు చేస్తుండగా, సాధారణ రకాన్ని 2183 రూపాయలకు కొంటున్నారు. ఈ యాసంగి సీజన్‌లో మొత్తం 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పైగా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. గడిచిన 20 రోజులుగా కొనుగోలు చేస్తున్న వారం రోజుల నుంచి ఎక్కువ మొత్తంలో కొంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు లక్షా 79,222 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. జిల్లాలో మొత్తం ఇప్పటి వరకు 26,062 మంది రైతుల నుంచి ధాన్యం సేకరించారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 394 కోట్ల రూపాయలు విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతుల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో ప్రతిరోజు 10వేల మెట్రిక్ టన్నులకు తగ్గకుండా ఈ ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 394 కోట్ల రూపాయల ధాన్యం కొనుగోలు చేయగా ప్రాథమిక వ్యవసాయ కేంద్రాల్లో 196 కోట్ల రూపాయల ట్యాబ్ ఎంట్రీ చేశారు. రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ధాన్యం అమ్మిన రైతుల వివరాల ఆధారంగా ఇప్పటి వరకు 148 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో అధికారులు జమ చేశారు. వేసవి ఎండలు పెరగడం, అకాల వర్షాలు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతుండగా అధికారులు మాత్రం నిత్యం ఈ కొనుగోళ్లను చేపడుతున్నారు. పూర్తిస్థాయిలో నిర్ణీత లక్ష్యానికి అనుగుణంగా సేకరణ పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో మొత్తం 11.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. దీంట్లో ట్రేడర్స్ 5లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేస్తారని అంచనాకు వచ్చారు. మిగతా ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. నిత్యం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు సమీక్షిస్తున్నారు. కొనుగోలు ఎక్కువగా జరిగే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లను చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థల అధికారులు చంద్రప్రకాశ్, జగదీశ్‌లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకే ధాన్యాన్ని కొంటున్నట్లు వారు తెలిపారు. నిబంధనల మేరకు మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని వారు వివరించారు.

'విధులను సక్రమంగా నిర్వర్తించాలి'

రామారెడ్డి/మాచారెడ్డి, ఏప్రిల్ 19: ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పేర్కొన్నారు. రామారెడ్డి, మాచారెడ్డి, పాల్వంచమర్రి కేంద్రాల్లో పాఠశాలలను శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి సంబంధించి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, మండలంలోని పోసానిపేట పాఠశాలలను సందర్శించి మౌలిక వసతుల కల్పనపై డీఈ, ఏఈలకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, వీవోలకు పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంఈవో యోసఫ్, ఇరిగేషన్ డీఈ శాలిని, ఏఈ సంతోష్, కాంప్లెక్స్ హెచ్ఎం ఆనంద్, హెచ్ఎంలు మురళీ, బ్రహ్మం, ఉపాధ్యాయులు ప్రవళిక, దేవ్లా, తదితరులు పాల్గొన్నారు.

● పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్

రాజంపేట్: అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మంజూరైన పనులను జూన్ 10లోగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులకు సూచించారు. శుక్రవారం రాజంపేట మండలంలోని ఆరెపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, ఆరెపల్లి తండా పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో గ్రామ సమాఖ్యల ఆధ్వర్యంలో పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పాఠశాలలో తాగునీరు, టాయిలెట్స్ వంటి మౌలిక వసతులు, చిన్న చిన్న మరమ్మతులను చేపట్టి పూర్తి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ సుష్మా, ఏఈ ఆనందం, ఎంఈవో రామస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఆరెపల్లిలో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి.పాటిల్

'23లోగా వయోవృద్ధులు, దివ్యాంగులు దరఖాస్తులు చేసుకోవాలి'

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 19: 85 ఏళ్ల పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు హక్కుని వినియోగించుకునేందుకు ఈనెల 23లోగా బూత్ లెవల్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో ఇంటి నుంచి ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్, అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 3 నుంచి 8వరకు అధికారులు వారి ఇంటికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులు వినియోగించుకోవాలని కోరారు. ప్రతీరోజు ఓటింగ్ వివరాలు బీఎల్వోలు అధికారులకు సాయంత్రం తెలియజేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటుహక్కు వేయడానికి ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ కేంద్రం సంఖ్య, బీఎల్వో పేరు, సెల్ నెంబర్ రాయించాలని తెలిపారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలను ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా పాఠశాల ఆవరణలో ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతులు, విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు లేకపోతే కొత్తగా నిర్మించడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. తాగునీటి వసతి, తరగతి గదులలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. జూన్ 10లోగా అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రఘునాథ్‌రావు, డీపీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు ప్రేమ్‌కుమార్, అనిల్‌కుమార్, జ్యోతి, సరళ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

● ఈవీఎంలను ఎల్లారెడ్డి, జుక్కల్‌కు తరలిస్తున్నాం

జిల్లాకు కేటాయించిన ఈవీఎంలను క్లోస్డ్ కంటైనర్‌లో జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు తరలిస్తున్నామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. శుక్రవారం పోలీసు కార్యాలయం సమీపంలోని ఈవీఎంల తరలింపును రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టారు. ఈనెల 3న ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్, ఫస్ట్‌లెవల్ చెకప్ పూర్తి చేయగా నియోజకవర్గాలకు వాటి తరలింపును చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం యంత్రాలపై అపోహలను తొలగించి, పారదర్శకత తీసుకువచ్చేందుకు ఎన్నికల కమిషన్ ర్యాండమైజేషన్ ప్రక్రియ ప్రారంభించిందని, ఏ ఈవీఎం ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో వెళ్తుందో ఆన్‌లైన్ ఎన్నికల కమిషన్ రూపొందించిన సాఫ్ట్‌వేర్ మాత్రమే నిర్దేశిస్తుందని అన్నారు. జుక్కల్ నియోజకవర్గానికి 318 చొప్పున బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, 357 వీవీ ప్యాట్‌లను తరలిస్తున్నామన్నారు. ఎల్లారెడ్డికి 337 చొప్పున బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను, 378 వీవీ ప్యాట్లను క్లోస్డ్ కంటైనర్‌లో తరలిస్తున్నామన్నారు. కామారెడ్డికి 33 చొప్పున బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌లు, 372 వీవీ ప్యాట్‌లను కేటాయించామని, మరి 199 బ్యాలెట్ యూనిట్లు, 147 కంట్రోల్ యూనిట్లు, 71 వీవీ ప్యాట్‌లు జిల్లాకేంద్రంలో రిజర్వ్‌లో ఉంచుతున్నామని పేర్కొన్నారు.

తూతూమంత్రంగా కళాశాలల తనిఖీలు

● తనిఖీలు చేస్తున్నా మారని బీఈడీ కళాశాలల తీరు ● కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు ● రాజకీయ ఒత్తిళ్లతో చర్యలకు వెనకాడుతున్న వర్సిటీ అధికారులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 19: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని బీఈడీ కళాశాలల్లో వసతులపై ఎన్‌సీఈటీ నిబంధనలకు మేరకు ప్రతీ ఏడాది జరగాల్సిన తనిఖీలు నామమాత్రంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలు నడుస్తున్న వాటిపై చర్యలు తీసుకునేందుకు వర్సిటీ అధికారులు ముందుకు వెళ్లడం లేదు. ఇందుకు నిదర్శనం గత 2023-24 విద్యసంవత్సరంలో జరిగిన తనిఖీల్లో బీఈడీ కళాశాలలు నిబంధనలకు అనుగుణంగా వసతులు లేకపోవడంతో వర్సిటీ ఆడిట్ సెల్ అధికారులు గుర్తించి ఆ కళాశాలల యాజమాన్యాలకు నోటీసులు సైతం ఇచ్చారు. కానీ ఇంతవరకు ఆ నోటీసులకు ఎటువంటి ప్రతిఫలం లేకుండా పోయింది. నోటీసులు ఇచ్చిన ఆ కళాశాలలు మాత్రం తీరును మార్చుకోలేదు. ఎన్‌సీఈటీ నిబంధనలు మేరకు ఉండాల్సిన ఎటువంటి వసతులు విద్యార్థులకు కల్పించడం లేదు దీంతో విద్యార్థులకు వసతులు అందడం లేదు. మౌళిక సదుపాయాలు లేక పోవడం కళాశాలల్లో ఉండాల్సిన క్రీడ మైదానం, తరగతి గదులు, ప్రాక్టికల్ కోసం ప్రత్యేక ల్యాబ్‌లు ఉండాలి అటువంటి కొన్ని కళాశాలల్లో చూద్దాం అనుకున్నా కనబడటం లేదు. మరికొన్ని కళాశాలల్లో విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూళ్ల చేస్తూ విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు మేరకు విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించడంలో జాప్యం జరుగుతుండటంతో కొన్ని కళాశాలల యాజమన్యాలు విద్యార్థుల నుంచే ముందుగానే ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వసూళ్ల చేస్తున్నారు. ల్యాబ్ ఫీజులు, కళాశాలల డెవలప్‌మెంట్ ఫీజులు, రికార్డు ఫీజులు పేరుతో లక్షల రూపాయలు వసూళ్ల చేస్తున్నారు. ఈ విషయాలపై తెలంగాణ యూనివర్సిటీ అధికారులకు తెలిసిన మిన్నుకుండిపోతున్నారనే అపవాదు వినబడుతుంది. అధిక ఫీజుల వసూళ్ల చేస్తున్నరనే ఆరోపణలతో ఆర్మూర్‌లోని ఓ బీఈడీ ప్రైవేట్ కళాశాలపై గతంలో రిజిస్ట్రార్ యాదగిరికి విద్యార్థి సంఘం నాయకులు సైతం వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి లక్షల రూపాయల్లో అక్రమంగా ఫీజులు వసూళ్ల చేస్తున్నా వర్సిటీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తనిఖీలు మాత్రం ఏదో తుతుమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపనాలు ఉన్నాయి. తనిఖీల విషయంలో ప్రతీ ఏడాది కొన్ని కళాశాలలు న్యాయస్థానాల ద్వార తాత్కాలికంగా లబ్ధి పొందుతూ నిబంధనలకు విరుద్ధంగా కళాశాల లను నడుపుతున్నారు. తనిఖీల్లో వాస్తవాలు బయటబడ్డా వాటిని వర్సిటీఅధికారులు చూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శఉంది. ఎందుకంటే ఆ ప్రైవేట్ కళాశాలలు కొందరు రాజకీయ నేతలతో వర్సిటీ అధికారులపై ఒత్తిళ్ల తెస్తున్నారనే అపవాదు ఉంది.


టీయూ పరిపాలన భవనం


రాజీనామా పత్రాన్ని డీసీవో కు అందజేస్తున్న సాంబారి మోహన్

అవిశ్వాసానికి ముందే
సొసైటీ చైర్మన్ రాజీనామా

● తాత్కాలిక చైర్మన్‌గా రమేష్ నియామకం
● త్వరలోనే చైర్మన్ ఎన్నిక: డీసీవో శ్రీనివాస్‌రావు

ఇందల్వాయి, ఏప్రిల్ 19: నల్లవెల్లి సొసైటీలో శుక్రవారం నాటకీయ పరిణామాల మధ్య సొసైటీ చైర్మన్ పదవికి సాంబారి మోహన్ రాజీనామా చేశారు. తాను నల్లవెల్లి సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత ఎంత నాటకీయ పరిణామాలతో ఐడీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారో అంతే నాటకీయంగా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో నల్లవెల్లి సింగిల్ విండో చైర్మన్ సాంబారి మోహన్‌పై ఈనెల 1వ తేదీన సొసైటీ మెజార్టీ డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టారు. దీనిని 3వ తేదీన డీసీవో శ్రీనివాస్‌రావు ఆమోదించి 19న బలనిరూపణకు సమయం ఇవ్వడంతో మెజార్టీ డైరెక్టర్లు అవిశ్వాసానికి అనుకూలంగా మద్దతు తెలిపేందుకు సొసైటీ కార్యాలయానికి చేరుకునే సమయానికి అరగంట ముందే సాంబారి మోహన్ తన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామాను డీసీవో శ్రీనివాస్‌రావు ఆమోదించి వెంటనే తాత్కాలిక చైర్మన్‌గా వైస్ చైర్మన్ చిన్నబోయిన రమేష్‌కు బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే చైర్మన్ ఎన్నిక ఉంటుందని ఆయన వెల్లడించారు. నల్లవెల్లి సొసైటీ చైర్మన్‌గా రాజీనామా చేసిన సాంబారి మోహన్ చైర్మన్ పదవి కోల్పోవడంతోనే జిల్లాలో ఐడీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పదవులు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. రాజీనామా అనంతరం సాంబారి మోహన్ మాట్లాడుతూ తనకు గత నాలుగేళ్లుగా అన్నివిధాలా సహాయ సహకారాలు అందించిన సొసైటీ డైరెక్టర్లకు, రైతులకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో నల్లవెల్లి సొసైటీని ఐడీసీఎంఎస్‌ను లాభాల బాటలో తీసుకెళ్లానని, అనివార్య కారణాలతో తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో డీసీవో శ్రీనివాస్‌రావుతో పాటు క్లస్టర్ అధికారి పోశన్న, సొసైటీ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

21న టీఎస్ ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 19: తెలంగాణ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఈనెల 21న టీఎస్ ఆర్‌జేసీ ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయ కర్త తారాసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని 32 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30ల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌ను టీఎస్‌ఆర్‌జేడీసీ.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తీసుకురావద్దని సమాచారం కోసం 9985432021, 9866559693 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు: సీఐ

బోధన్‌రూరల్, ఏప్రిల్ 19: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే జైలు శిక్ష తప్పదని బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. రెండు రోజుల క్రితం డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఓ వ్యక్తిని కోర్టుకు పంపించగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష పడినట్లు వివరించారు. ప్రతీరోజు ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు డ్రంక్ డ్రైవ్ నిర్వహిస్తున్నారని, డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిని కోర్టుకు పంపిస్తున్నామని ఆయన తెలిపారు. తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానతో పాటు జైలుశిక్ష తప్పదని ఆయన పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

ధర్పల్లి ఏప్రిల్ 19: మండల కేంద్రానికి చెందిన డొక్క ప్రియరంజనీ అనే యువతి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందినటన్లు ఎస్సై విక్రం తెలిపారు. శుక్రవారం ఉదయం 6గంటల నుంచి కనిపించడం లేదని తన కూతురు ప్రియరంజనీ కనిపించడం లేదని, దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదని ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. తండ్రి డొక్క రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నామినేషన్ల దాఖలుకు
తరలివచ్చిన పొరుగు జిల్లా కార్యకర్తలు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్19: నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్ల సమర్పణకు పార్లమెంట్ పరిధిలోని కోరుట్ల, జగిత్యాల నియోజికవర్గంలోని పలుగ్రామాల నుంచి బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీ కార్యకర్తలు జిల్లా సరిహద్దులోని కమ్మర్‌పల్లి మీదుగా నిజామాబాద్‌కు తరలివెళ్లారు. అయితే నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్, బీజేపీ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద్ శుక్రవారం తమ నామినేషన్లు సమర్పించనున్న సందర్భంగా జిల్లా సరిహద్దులోని కమ్మర్‌పల్లి మీదుగా వెలుతున్న కార్లు, ఇతర వాహనాలను బ్రహ్మగారిగుట్ట (జంబిహనుమాన్ ఆలయం) వద్ద ఏర్పాటుచేసిన పోలీస్‌చెక్‌పోస్టు వద్ద ఎంపీడీవో రాజశ్రీనివాస్, స్థానిక డ్యూటీ పోలీసు సాగర్ వాహనాలను తనిఖీ చేశారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్19: మండలకేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మిస్తున్న చిలుకల చిన్నవ్వ ఆలయ నిర్మాణానికి ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పస్కనర్సయ్య, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, వీడీసీ అధ్యక్షుడు నలిమెల మోహన్, రాజన్న, గంగాధర్, సంజీవ్, మల్లారెడ్డి, ముత్యం, నవనీత్, ఉదయ్ పాల్గొన్నారు.

నేడు సేవాలాల్, రాంరావు మహరాజ్ విగ్రహాల ప్రతిష్ఠాపన

ఇందల్వాయి, ఏప్రిల్ 19: మండలంలోని స్టేషన్‌తండాలో శని, ఆదివారం సేవాలాల్, రాంరావు మహారాజ్‌ల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు బంజారా సేవాసంఘం సభ్యులు తెలిపారు. శుక్రవారం హోమం నిర్వహించి కార్యక్రమాలను ప్రారంభించారు. శనివారం విగ్రహాల ప్రతిష్ఠాపన ఉంటుందని, ఆదివారం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

నవీపేట, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి తర్వాత రెండు రోజులకు ఆనవాయితీ ప్రకారం ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

'ఎంపీగా గెలిస్తే బోధన్-బీదర్ రైల్వే లైన్ ఏర్పాటుకు కృషి'


మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్

కోటగిరి, ఏప్రిల్ 19: తనను జహీరాబాద్ ఎంపీగా గెలిపిస్తే బోధన్-బీదర్ రైల్వేలైన్ ఏర్పాటుకు ప్రత్యేక కృషిచేస్తానని కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఉమ్మడి మండలాల కార్యకర్తల సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ బీబీపాటిల్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పదేళ్లుగా ఎంపీగా పని చేసిన బీబీపాటిల్ తన వ్యాపారాలకే ప్రాధాన్యతను ఇచ్చారని, ప్రజాసమస్యలు ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. దేవుడి పేరుతో ఓట్లు పడతాయనే ఉద్దేశంతో బీబీపాటిల్ టీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారని ఆరోపించారు. ప్రజలకు సేవ చేస్తే ఓట్లు వేసి గెలిపిస్తారని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో 14ఎంపీ సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి మాట్లాడారు.

వర్ని: ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్.. అతనో బిజినెస్ పాటిల్ అని జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ విమర్శించారు. శుక్రవారం చందూర్, వర్ని మండల కేంద్రాల్లో ఉమ్మడి మండలాల పార్టీ సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండుసార్లు ఎంపీగా బీబీపాటిల్‌ను గెలిపించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం అతను టీఆర్‌ఎస్‌కు పనికి రాని వ్యక్తిగా పేర్కొన్నారని, అందుకే దేవుడిపేరు చెప్పుకుంటే ఓట్లు వస్తాయని బీబీపాటిల్ బీజేపీ జెండా పట్టి కోట్ల రూపాయలతో టికెట్ తెచ్చుకున్నారని ఆరోపించారు. ఎంపీగా ఏనాడూ గ్రామాల్లోకి రాని వ్యక్తి కేవలం ఓట్ల కోసమే ప్రచారాలకు రావడం సిగ్గు చేటని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి శకం ముగిసిపోయిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తూ అక్రమ కేసుల్లో ఇరికించిన చరిత్ర పోచారందేనని అన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ స్పోర్ట్స్ పర్సన్ గిరిజా షెట్కార్, వైస్ ఎంపీపీ దశ గౌడ్, యలమంచిలి శ్రీనివాస్ రావు, వీర్రాజు, సురేష్ బాబా, రాజిరెడ్డి, చంద్రశేఖర్, రాంబాబు, గంగప్ప, ఆయా మండలాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

'విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న
పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి'

బోధన్‌రూరల్, ఏప్రిల్19: విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న బోధన్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి సంజయ్ తలారే డిమాండ్ చేశారు. శుక్రవారం బోధన్ మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వెళ్లే సమయంలో రైల్వే గేట్లు వేస్తున్న క్రమంలో ఓ ప్రైవేటు పాఠశాల బస్సు దూసుకుని లోపలికి వచ్చి మరో గేటు వద్ద ఆగిపోయిందన్నారు. ఈ ఘటన చూసి ప్రజలు అవాక్కయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. బస్సు గేటుకు ఒక పక్కకు ఉండిపోవడంతో రైలు సాఫీగా వెళ్లిపోయింది. ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారని పేర్కొన్నారు. సంబంధిత డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రథం షెడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 19: మండలకేంద్రం శివారులోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి రథం నిలుపేందుకు కావాలసిన షెడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆలయ, గ్రామాభిశృద్ధి కమిటీ అస్యుల ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం జరిగింది. ఆలయ అర్చకులు కప్పగంటి రమేష్ చంద్రశాస్త్రి అధ్వర్యంలో భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, సభ్యులు అంకిత్, జేసీబి రాజన్న, దశాగౌడ్, భూమేశ్వర్ పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న వీడీసీ సభ్యులు


కరపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పలు వార్డుల్లో బీజేపీ ప్రచారం

ఆర్మూర్‌టౌన్ ఏప్రిల్19: మున్సిపల్ పరిధిలోని 31, 32, 33వార్డులలో శుక్రవారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఒక్కరు బీజేపీకి ఓటువేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను వారు కోరారు. కేంద్రప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం పసుపుబోర్డును తీసుకువచ్చి అవినీతికి తావు లేకుండా అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న బీజేపీ అభ్యర్థి అర్వింద్‌కు ఓటు వేయాలని ప్రజలను వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, నాయకులు శికారి శ్రీనివాస్, బాశెట్టి రాజ్‌కుమార్, దోండి ప్రకాష్, బోడమీది నవీన్, సురేందర్, మనోహర్, ప్రభాకర్, సతీష్, నవీన్, ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవీపేట, ఏప్రిల్19: మండలంలోని నిజాంపూర్ నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం ఉదయం పట్టుకోవడం జరిగిందని ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నిజాంపూర్ నుంచి జన్నేపల్లి వైపు ఇసుక ట్రాక్టర్లు వెళ్తుండగా పోలీసు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు చెప్పారు. సంబంధిత ట్రాక్టర్ల యాజమానులకు ఒక్కొక్కరికి తహసీల్దార్ నారాయణ 10వేల రూపాయల చొప్పున జరిమాన విధించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన కోఆప్షన్ మెంబర్

మోస్రా,ఏప్రిల్19: చందూర్ మండల కేంద్రంలో ఉమ్మడి మండల జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో మోస్రామండల కోఆప్షన్ మెంబర్ ఫిరోజ్‌తో పాటు 15మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మోస్రా మండల కన్వీనర్ కొత్తకొండ భాస్కర్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తిమీర్‌కర్ అశోక్, మోస్రా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సైనాపురం నర్సారెడ్డి, బొజ్జ శ్రీనివాస్ గౌడ్, బిల్లా రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

ఎడపల్లి, ఏప్రిల్ 19: మండలంలోని జానకంపేట గ్రామ శివారులో ఏర్పాటైన పోలీసు శిక్షణాకేంద్రంలో నిర్మించిన ఆలయంలో శుక్రవారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి జిల్లా అదనపు కమీషనర్, పోలీస్ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయ ప్రాంగణంలో వేద పండితులతో నిర్వహించిన యజ్ఞ హోమం, పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో కొలువు దీరిన అభయాంజనేయ స్వామికి తొలి పూజలు చేశారు. వేద పండితులు ఆలయ శిఖర ప్రతిష్ఠాపన అనంతరం నూతనంగా ప్రతిష్ఠించిన హనుమంతునికి ప్రత్యేక అలంకరణ చేసి హారతి ఇచ్చారు. ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవానికి హాజరైన పోలీసు అధికారులను, స్థానిక ప్రాత్రికేయులను సిటీసి ఆధ్వర్యంలో సన్మానించారు. ఠాణాకలాన్, జానకంపేట గ్రామాలకు చెందిన హనుమాన్ దీక్ష స్వాములు ఈ ఉత్సవంలో సేవలందించారు. అనంతరం ఉత్సవానికి హాజరైన అందరికీ అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవంలో పోలీసుశిక్షణా కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ మస్తాన్ అలీ, కమాండెంట్ శంకర్, ఏఆర్ ఏసీపీ నాగయ్య, ఆర్‌ఐలు శ్రీపాల్, వెంకట్, శ్రీనివాస్, దేవి సింగ్, కోటేశ్వర్ రావు, సురేష్, నిజామాబాద్ మాజీ కార్పోరేటర్ సాయన్న, జానకంపేట బీజేపీ నాయకులు ఉప్పు సురేష్, ఎంపీటీసీ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.


పూర్ణాహుతి చేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

'కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి'

పెద్దబజార్, ఏప్రిల్ 19: అనేక హామీలతో గద్దెనెక్కిన ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి చూపించాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతికి అడ్డా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు అని అన్నారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రభంజనాన్ని భరించలేక అన్ని సర్వేలు ఈసారి కేంద్రంలో 400 సీట్లు బీజేపీకి పక్కా అని వెల్లడిస్తున్నాయని అన్నారు. రాహుల్‌బాబా ఈరోజు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, అవినీతికి మోదీ చాంపియన్ అని అనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మోదీ గురించి మాట్లాడేటప్పుడు స్థాయికి తగ్గట్టు మాట్లాడాలన్నారు. కాంగ్రెస్ గత 50, 60ఏళ్ల పాలనలో మొత్తం అవినీతిమయమని, 2జీ, 3జీ స్కామ్ అయినా అది కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమైందని అన్నారు. దేశాన్నే కుటుంబంగా భావించి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా నిరంతరం దేశాభివృద్ధికి, దేశప్రజలకు సేవలందిస్తున్న మోదీని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంటే ప్రజలు అన్ని గమనిస్తున్నారని, తప్పకుండా ఓటుతో బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. కార్యకమంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, కార్పొరేటర్లు న్యాలం రాజు, పంచరెడ్డి ప్రవళిక, చుక్క మధు, మెట్టు విజయ్, నారాయణ, తదితరులు, పాల్గొన్నారు.

రామాలయంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మోస్రా, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో చైత్ర శుద్ధ ఏకాదశి సందర్భంగా నారాయణఖేడ్ నియోజకవర్గ శాసన సభ్యులు పట్లోళ్ల సంజీవ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి పార్లమెంట్ ఎన్నికల విషయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడు నందు పటేల్, గ్రామ అధ్యక్షుడు సైనిపురం నర్సారెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంఘం సాయిలు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్ గౌడ్, పిట్ల హరీష్, బిల్లా రాజు, సతీష్, సూర్య, పిట్ల శ్రీకాంత్, చింటు, శ్రీధర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ఎడపల్లి, ఏప్రిల్ 19: మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలోగల చెరువులో దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోలేపల్లి ఇంద్రజ (40) మహిళ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆమెబ తీవ్ర మనస్థాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి భర్త అశోక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమ పాలన'

బోధన్‌రూరల్, ఏప్రిల్ 19: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమ పాలన అమలవుతుందని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ నుండి టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గత 10సంవత్సరాల కాలంలో కేసీఆర్ రాష్ట్రంలో అవినీతి పాలన చేశారని, పనికి రాని ప్రాజెక్టుల పేరుతో కోట్ల రూపాయలు కూడగట్టుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఎంపీపీతో పాటు భవానీపేట్ మాజీ సర్పంచ్ పల్లెంపాటి కృష్ణకాంత్, లంగ్డాపూర్ ఉప సర్పంచ్ సత్యనారాయణలతో పాటు సాలూర, బోధన్ మండలాలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



ఒడ్డెరకాలనీలో తాగునీటి సరఫరాపై వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

తాగునీటి సరఫరాలో అంతరాయం రావొద్దు

• రాష్ట్ర ఇంజనీరింగ్ చీఫ్ పబ్లిక్ హెల్త్ అధికారి ఆర్.శ్రీధర్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్19: ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఇంజనీరింగ్ చీఫ్ పబ్లిక్ హెల్త్ అధికారి ఆర్.శ్రీధర్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని జిరాయత్‌నగర్, ఒడ్డెరకాలనీలో పర్యటించి ప్రజలను తాగునీటి సరఫరా గురించి అడిగితెలుసుకున్నారు. అనంతరం మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేస్తున్న బాల్కొండ మండల కేంద్రంలోని నీటి శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేసి ఫిల్టర్ బెడ్‌లను మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజాఆరోగ్య కార్యనిర్వాహక ఇంజనీర్ టి.తిరుపతికుమార్, మున్సిపల్‌కమిషనర్ ఎ.రాజు, ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ నగేష్, మున్సిపల్ ఇంజనీర్ ఎస్.భూమేశ్వర్, అసిస్టెంట్ ఇంజనీర్ రఘు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

• తాగునీటి సమస్య లేకుండా చర్యలు

జక్రాన్‌పల్లి: వేసవి ముగిసేవరకు గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ శాఖ అధికారి తరుణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం జక్రాన్‌పల్లి గ్రామాన్ని జిల్లా పంచాయతీ శాఖ అధికారి తరుణ్‌కుమార్ సందర్శించారు. అనంతరం తాగునీటి సమస్య గురించి అధికారులను అడిగితెలుసుకున్నారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని వైఎస్.నగర్ కాలనీలో పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయనవెంట ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎంపీవో యుసుఫ్‌ఖాన్, పంచాయతీకార్యదర్శి నరేష్ ఉన్నారు.

'ఓటు హక్కును కాలరాస్తున్నారు'

పెద్దబజార్, ఏప్రిల్19: ప్రజల ఆర్థిక బలహీనతలను ఆసరాగా చేసుకొని ఎన్నికలో మద్యం, డబ్బులు పంచి భారత రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, ఓటుహక్కును కాలరాస్తున్నారని బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండివెంకటి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన నగరంలోని సంజీవయ్య కాలనీలోగల గౌడసంఘంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు మద్యం, డబ్బులు పంచకుండా ఓట్లు అడిగే దమ్ము లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఎల్‌ఎఫ్ మహిళా రాష్ట్ర కన్వీనర్ సబ్బనిలత, జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి, జ్యోతి, రాజు, అక్బర్ పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరు పరిశీలన

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్19: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని జిల్లాలోని ఆయా ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరును వ్యయ పరిశీలకుడు డీఎం నిమేజి శుక్రవారం పరిశీలించారు. మాధవనగర్, ఇందల్వాయి తదితర ప్రాంతాలలో ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ బృందాలు నిర్వహిస్తున్న తనిఖీలు, ఇతర కార్యకలాపాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలయ్యేలా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ గట్టి నిఘా కొనసాగించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఆయన వెంట జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య ఉన్నారు.

క్రీడాకారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్19: పట్టణంలోని గురుకుల పాఠశాలలో క్రీడాకారులకు, విద్యార్థులకు చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న అండర్-12 బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు విద్యార్థులకు ప్రథమ చికిత్సను అందిస్తూ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఎంజె.రమేష్, సాయి, పీఈటీ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పండ్ల పంపిణీ

పెద్దబజార్, ఏప్రిల్ 19: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మహవీర్ జన్మ కళ్యాణం సందర్భంగా శుక్రవారం రోగులకు పండ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైన సంఘం సభ్యులు దర్శన్‌జైన్, కోచట్ జైన్, డాక్టర్ ఫరాస్‌జైన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఆర్మూర్‌టౌన్ ఏప్రిల్19: పట్టణంలోని సిద్దులగుట్ట సమీపంలో 63వ జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వినేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం నిజామాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ డిపో బస్సు సిద్దులగుట్ట సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వివేక్‌ను ఢీకొట్టింది. దీంతో కిందపడిన వినేష్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 17 మందికి జరిమానా

• ముగ్గురు వ్యక్తులకు రెండు రోజుల జైలు శిక్ష

ఖిల్లా, ఏప్రిల్ 19: మద్యం తాగి వాహనాలు నడిపిన 17 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ ఎ.నారాయణ నేతృత్వంలో ప్రతిరోజు వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం 17 మందిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి కోర్టు ఎదుట హాజరుపర్చగా ఇందులో 14 మందికి 17,600 రూపాయల జరిమానా విధించారు. మరో ముగ్గురు వ్యక్తులకు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే జిల్లా అభివృద్ధి

• అర్బన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వక్తలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్19: గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జిల్లాలో జరిగిన అభివృద్ధి శూన్యమని, గతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధే తప్ప జిల్లాకు ఒరిగింది ఏమీలేదని మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని ఆర్మూర్ రోడ్ లోగల లక్ష్మికళ్యాణ మండపంలో అర్బన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన నేతలు మాట్లాడుతూ గత ఐదేళ్లగా ఎంపీగా పనిచేసిన అర్వింద్ కేంద్రంలో అధికారంలో ఉండి జిల్లాకు చేసింది ఏమీలేదని అన్నారు. కేవలం రాముడు పేరు చెప్పి మతవిద్వేశాలను రెచ్చగొట్టి బీజేపీ ఓట్లు అడుగుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో మతతత్వ బీజేపీకి, బీఆర్‌ఎస్ పార్టీలకు బుది చెప్పాలన్నారు. సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, రాజేశ్వర్‌రావు, ఉర్దూ అకాడమి ఛైర్మన్‌తాహెర్‌బిన్ హుందాన్, నాయకులు గడుగు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

అరాచక పాలన నుంచి దేశాన్ని రక్షించుకోవాలి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

బోధన్‌రూరల్, ఏప్రిల్19: బీజేపీ అరాచక పాలన నుంచి దేశాన్ని రక్షించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి కోరారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని రవి గార్డెన్‌లో బోధన్, సాలూర మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఇండియా కూటమి ప్రభుత్వ ఏర్పాటులో నిజామాబాద్ కీలకపాత్ర పోషించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కార్యకర్తలు ప్రచారం చేయాలని, కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. చక్కెర కర్మాగారం పునర్‌ప్రారంభం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ జీవన్‌రెడ్డిని జిల్లా ప్రజలు లక్ష మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పద్మశరత్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్‌హందాన్, జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, జడ్పీవైస్ ఛైర్మన్ రజితాయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు ఎల్లవేళలా ఉండి జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మాక్లూర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పసుపు బోర్డు పేరు చెప్పి అబద్దపు వాగ్దానాలు చేసి కనీసం నల్లబోర్డు కూడాఏర్పాటు చేయలేకపోయాడని విమర్శించారు. గల్ఫ్, బీడీ కార్మికులు, రైతులు, కార్మికుల కార్యక్రమంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, నాయకుడు వినయ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ మార చంద్రమోహన్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బాజిరెడ్డి నామినేషన్‌కు తరలివెళ్లిన నాయకులు

మోపాల్, ఏప్రిల్ 19: బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం నామినేషన్ వేయడంతో పార్టీ నాయకులు, మోపాల్ మండలంలోని ఆయా గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ అధ్యక్షుడు మొచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ ప్రజాప్రతినిధులతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తరలివెళ్లారు.

నేడు, రేపు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్, ఏప్రిల్19: నగరంలోని వినాయక్‌నగర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శనివారం, ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నగర టౌన్-1 ఏడీఈ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిని పెంచుతున్నామని, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ హైదరాబాద్ నుంచి వస్తుండడంతో అంతరాయం ఉంటుందని తెలిపారు.



పంటను పరిశీలిస్తున్న అధికారి

నువ్వుల పంట పరిశీలన

ఏర్గట్ల, ఏప్రిల్ 19: మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు నువ్వు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ నువ్వు పంటలో వేరుకుళ్లు తెగుళ్ల గుర్తించామని, వాటి నివారణ కోసం సీవోసీ కాపర్ ఆక్సిక్లోరైడ్ మందు 3గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలని, వెర్రితెగులుకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్‌ల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని, రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సాయి సచిన్, రైతులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదంపై జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తున్న సిబ్బంది

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఖిల్లా, ఏప్రిల్ 19 : అగ్నిప్రమాదాలనివారణపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖాధికారి నర్సింగ్‌రావ్ తెలిపారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులకు, సిబ్బందికి అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా నివారించాలి, తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. సిలిండర్‌కు ప్రమాదవశాత్తు మంటలు అంటుకుంటే దానిని ఎలా అరికట్టాలి.. లాంటి విషయాలను ప్రదర్శణ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అగ్నిమాపక శాఖ అధికారి గంగాదాస్ అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని రిలయన్స్‌మాల్స్, పంచవటి మాల్స్‌లలో అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది హైమద్, రషీద్, రాజశేఖర్, మాల్స్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థుల అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్19: నిజామాబాద్ పార్లమెంటరీ రెండుప్రధాన పార్టీల అభ్యర్థులు శుక్రవారం తమ నామినేషన్లను దాఖలు చేశారు. బీజేపీ తరఫున ధర్మపురి అర్వింద్ నామినేషన్ దాఖలు చేయగా, బీఆర్‌ఎస్ తరఫున బాజిరెడ్డి గోవర్ధన్ నామినేషన్లు వేయగా తమ అఫిడవిట్లలో ఆస్తుల వివరాలను ప్రకటించారు.

• ధర్మపురి అర్వింద్ స్థిర, చరాస్తులివి..

ధర్మపురి అర్వింద్ తన స్థిరాస్తి, చరాస్తులను ప్రకటించారు. తన మొత్తం ఆస్తులు రూ.97కోట్ల 53లక్షల 52వేల 512 ఉన్నట్లు ప్రకటించారు. చరాస్తులు రూ.47కోట్ల 71లక్షల 90వేల 312, స్థిరాస్తులు 49కోట్ల 51లక్షల 62వేల 200గా ప్రకటించారు. భార్య పేరుపై రూ.12కోట్ల 11లక్షల 70వేల 114 చరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. డిపెండెంట్ పేరుపై 24లక్షల 97వేల 647 ఉన్నట్లు తెలిపారు. ఆయనకు రుణాలు 19 కోట్ల 17లక్షల 38వేల 918, భార్య పేరుపై రూ.11కోట్ల 49లక్షల 63వేల రుణాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన పేరుపై ఫార్చునర్ కారు, భార్యపేరు మీద ఇన్నోవా కారు ఉన్నట్లు తెలిపారు. బంగారం 850గ్రాములు, 92లక్షల 89వేల విలువైన షేర్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆయనకు జూబ్లీహిల్స్‌లోని కమర్షియల్ బిల్డింగ్‌లో 39వేల 200 స్క్వేర్ ఫీట్ల ప్లాట్, నందిహిల్స్‌లో ఒక ప్లాట్ ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆయనపైన 22 కేసులు ఉన్నట్లు అఫిడవిట్‌లో తెలిపారు.

• బాజిరెడ్డి గోవర్దన్ స్థిర, చరాస్తులివి..


బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు స్థిర, చరాస్తులు రూ.3కోట్ల 85లక్షల 90వేల 17 ఉన్నట్లు అఫిడవిట్‌లో తెలిపారు. వీటిలో చరాస్తులు కోటి 90లక్షల 17, స్థిరాస్తులు 2కోట్ల 85లక్షలుగా పేర్కొన్నారు. భార్యపేరుపై చరాస్తులు 13లక్షల 41వేల 647, స్థిరాస్తులు 35లక్షల 50వేలు ఉన్నట్లు అఫిడవిట్‌లో తెలిపారు. చీమన్‌పల్లిలో 25 ఎకరాల భూమి, భార్యపేరు మీద 6 ఎకరాల 21గుంట భూమి ఉన్నట్లు పేర్కొన్నారు. నిజామాబాద్‌లో ఒక ఇల్లు, రాజేంద్రనగర్‌లో 500 స్క్వేర్ యార్డ్స్ భూమి, కొండాపూర్‌లో 100 స్క్వేర్ యార్డ్స్, జక్రాన్‌పల్లిలో 6 ఎకరాల 20గుంటల భూమి ఉన్నట్లు అఫిడవిట్‌లో తెలిపారు. బీబీపూర్‌లో 3 ఎకరాల భూమి ఉన్నట్లు అఫిడవిట్‌లో తెలిపారు. ఆయన పేరుపై 30లక్షల విలువైన జీప్‌పై వాహనం, భార్య పేరుపై 50 తులాల బంగారం ఉన్నట్లు తెలిపారు. ఆయనకు ఒకబ్రాస్‌లెట్, మూడు ఉంగరాలు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

క్రిస్టియన్ల మద్దతు కాంగ్రెస్‌కే

• మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 19: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందని వచ్చే పార్లమెంట్ ఎన్నికలో క్రిస్టియన్ల మద్దతు కాంగ్రెస్‌కే ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి రావడం తనకు సొంత ఇంటికి వచ్చినట్లుగానే ఉందని ఆయన అన్నారు. తన రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీలోనే ప్రారంభమైందన్నారు. కౌన్సిలర్ స్థాయి నుంచి మొదలుకొని ఎమ్మెల్సీగా తనకు రాజకీయ జన్మనిచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి అయ్యేందుకు పార్టీ శ్రేణులు అంతా కష్టపడాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ భక్తవత్సలం, ముప్పగంగారెడ్డి, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన మాజీ మంత్రులు షబ్బీర్‌అలీ, సుదర్శన్‌రెడ్డి తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



కాంగ్రెస్‌లో చేరుతున్న రజక సంఘం సభ్యులు

మోర్తాడ్, ఏప్రిల్ 19: భీమ్‌గల్ మండల కేంద్రంలోని వివిధ వార్డులకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో భారీఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1వ వార్డుకు చెందిన అడ్వొకేట్ సురేష్, కళ్యాణలతో పాటు 20 మంది, 2వార్డు నుంచి వెంకటేష్, గడ్డం గంగాధర్, దాసు మరో 20మంది, 4వార్డులో మీసాల శీను, సురేష్, నవీన్ మరో 30మంది, 5వార్డులో సుంకం నారాయణ, రవి, భరత్, అజ్జు మరో 20మంది, 8 వార్డులో బీఆర్‌ఎస్ గంగారాం, భరత్, కళ్యాణ్, 11వార్డులో సల్మా, అంజు మరో 30మంది, బీఆర్‌ఎస్ నుంచి 20మంది కాంగ్రెస్‌లో చేరారు. సునీల్‌కుమార్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలో ఆహ్వానించారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు జెజె నర్సయ్య, అనంత్‌రావు, మల్లేశ్వర్, సాయిబాబా, పల్లె శేఖర్, రత్నం, రాజు, లింబాద్రి, నాయకులు పాల్గొన్నారు.

• కాంగ్రెస్‌లో చేరిన మోర్తాడ్ రజక సంఘ సభ్యులు

మోర్తాడ్‌కు చెందిన రజక సంఘ సభ్యులు ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం ప్రజాభవన్‌లో రజకసంఘానికి చెందిన ఒరగంటి, కల్లూర్ రెండు పంతల రజక సంఘం సభ్యులు, మహిళలు బాల్కొండ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, మాజీఎంపీపీ గిర్మాజి గంగాధర్, అడ్వకేట్ కుదురుపక ప్రవీన్, తదితరులు

• ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీలో చేరిక

మాక్లూర్: మండలంలోని బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఉప సర్పంచ్‌లు కాంగ్రెస్‌లో చేరగా వారికి గురువారం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి కాంగ్రెస్ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. వల్లభపూర్, మెట్‌పల్లి, గొట్టుముక్కల మాజీ సర్పంచ్లు సుధాకర్, చిన్నారెడ్డి, దారం ప్రవీన్, ఎంపీటీసీలు పురుషోత్తంరావు, మామిడిపల్లి ఎంపీటీసీలు సత్యనారాయణ, సింగంపల్లి తండా మాజీ ఉపసర్పంచ్ సవాయిరాం, పార్థ నర్సయ్య బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు.



కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్ కుమార్

ముప్కాల్: మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ జక్క రాజేశ్వర్, నాగంపేట్ మాజీ ఉపసర్పంచ్ చిట్టెన్న, వేంపల్లి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మల్లరి గంగాధర్, వార్డుసభ్యులు గంగాధర్, పీఏసీఎస్ డైరెక్టర్ ఆకుల రాములు, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కలిసి కాంగ్రెస్‌లో చేరారు. మండలకాంగ్రెస్ అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో గురువారం బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ వీరిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మహేష్, నవీన్, కోల ప్రవీన్, కొమ్ముల శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు

'ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలి'

కమ్మర్‌పల్లి, ఏప్రిల్19: ఉపాధిహామీ కూలీలకు 200రోజుల పని కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కిషన్, అశోక్ డిమాండ్ చేశారు. మండలంలోని చౌట్‌పల్లి, బషీరాబద్ గ్రామశివారుల్లో కొనసాగుతున్న ఉపాధి పనుల్లో కూలీలకు కల్పించిన వసతులను క్షేత్రస్థాయిలో శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలకు ప్రతీవారం కూలి చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో కనీసం సౌకర్యాలు కల్పించాలన్నారు.

దొంగతనం కేసులో ముగ్గురికి జైలు

నిజామాబాద్ లీగల్, ఏప్రిల్ 19: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ వృద్ధురాలిని గొంతునిలిమి ఆమె ఒంటిపై బంగారు ఆభరణాలు దొంగిలించిన నేరస్థులకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల శుక్రవారం తీర్పునిచ్చారు. డిచ్‌పల్లి మండలం సుద్దులం గ్రామానికి చెందిన నీరడి అరుణ్, నీరడి రాజమణి, రెంజల్‌లోని కుర్నాపల్లి గ్రామానికి చెందిన సావిత్రి, కల్లూరి గ్రామానికి చెందిన దర్జిసాయిలు 8 మే 2022న ఇంటి అద్దె కోసం నిజామాబాద్ నగరంలోని గౌతంనగర్ కాలనీకి చెందిన బోయిని పోచమ్మ ఇంటికి వెళ్లి ఇల్లు అద్దె ఇళ్లు కావాలని ఇంట్లోకి చొరబడి గొంతునులిమి హత్య చేశారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను తీసుకొని పారిపోయారు. ఈ కేసులో కోర్టు 19మంది సాక్షుల ఆధారంగా అరుణ్, సాయిలు, రాజమణిలపై నేరారోపణ రుజువైనట్లు నిర్ధారించారు. వీరికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.76,400	రూ.70,600	రూ.880

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : ఫ్యామిలీ స్టార్ (1.10, 7.25)
: టిల్లు స్క్వేర్ (4.30, 10.25)
స్ర్కీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (1.40)
: మంజుమ్మల్ బాయ్స్ (4.20, 10.35)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ) (7.15)
స్ర్కీన్-3 : తెప్ప సముద్రం (1.40)
: పారిజాత పర్వం (4.35)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (7.30)
: మార్కెట్ మహాలక్ష్మి (10.35)
స్ర్కీన్-4 : హ్యాపిడేస్ (1.30)
: లవ్‌యూ శంకర్ (తెలుగు) (4.50)
: టెనెంట్ (7.30)
: మైదాన్ (హిందీ) (9.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : మార్కెట్ మహాలక్ష్మి (10.50)
: టిల్లు స్క్వేర్ (1.45, 7.30)
: మంజుమ్మల్ బాయ్స్ (4.35, 10.30)
స్ర్కీన్-2 : పారిజాత పర్వం (1.30)
: ఫ్యామిలీ స్టార్ (4.30, 10.30)
: లవ్‌యూ శంకర్ (తెలుగు) (7.40)
స్ర్కీన్-3 : హ్యాపిడేస్ (10.30, 4.30, 10.30)
: టెనెంట్ (1.40)
: మంజుమ్మల్ బాయ్స్ (7.35)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్: ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : హ్యాపిడేస్ (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : గీతాంజలి మళ్లీ వచ్చింది (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్